నోటీసులకే పరిమితమా!

- శిథిల భవనాలపై చర్యలు శూన్యం
- 30 భవనాల వరకు గుర్తింపు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న పట్టణ వాసులు



మిర్యాలగూడలో శిథిలావస్థలో ఉన్న గృహం



శిథిలావస్థలో ఉన్న గృహ యజమానికి నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : పురాతన భవనాలు, ఇళ్ల బలహీనమైన ప్రహరీలు, కమాన్లు, చుట్టూ పక్కల వారిని భయపెడుతున్నాయి. అవి శిథిలావస్థలోకి చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ శిథిల భవనాలపై టౌన్ ప్లానింగ్, వార్డు ఆఫీసర్లకు నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. అయితే క్షేత్ర స్థాయిలో వారు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు అనడానికి పట్టణంలో ఉన్న పలు పురాతన భవనాలే నిదర్శనం.

నోటీసులు జారీ..

మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగం ఇటీవల విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రైవేటు భవనాలు, శిథిలావస్థలో ఉన్న గృహ యజమానులకు నోటీసులు కూడా జారీ చేశారు. కొన్నింటిలో గృహ యజమానులే ఉంటుండగా మరి కొన్నింటిలో అద్దెలకు ఇచ్చినట్లు తెలుస్తుంది. సంబంధిత గృహ యాజమానులకు నోటీసులు జారీ చేసిన అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. అయితే పూర్తిగా శిథిలావస్థలో ఉన్న భవనాలకు కొంత మంది మరమ్మతులు కూడా చేయించుకుంటున్నారు.

అధికారుల దృష్టికి రానివి ఎన్నో..

మున్సిపాలిటీలోని 48 వార్డులు ఉండగా ఈ వార్డుల్లో మొత్తం 26 వేల 758 అసెస్‌మెంట్లు ఉన్నాయి. అయితే సుమారు 2 వేల నుంచి 3 వేల వరకు శిథిలావస్థలో ఉన్న గృహాలు, బీటలు వారిన గృహాలు ఉండవచ్చని తెలుస్తుంది. అయితే అన్ని వార్డులను కలుపుకొని పట్టణ ప్రణాళిక విభాగం కేవలం 30వరకు శిథిలావస్థలో ఉండవచ్చని అంచనాలు వేయడం గమనార్హం. ప్రధానంగా శివారు ప్రాంతాల్లోనే శిథిలావస్థలో ఉన్న గృహాలు అధికంగా ఉంటాయని చుట్టు పక్కల వారు పేర్కొంటున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం



మున్సిపాలిటీలో ఇప్పటి వరకు సుమారు 30వరకు శిథిలావస్థలో ఉన్న గృహాలు, ప్రహరీలను గుర్తించడంతో పాటు వారికి ముందస్తుగా నోటీసులను కూడా జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వార్డు ఆఫీసర్లకు ఇప్పటికే కమిషనర్ సూచనలు చేశారు. మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక చర్యలను చేపడతాం.

– అంజయ్య, పట్టణప్రణాళిక విభాగం సూపర్‌వైజర్

ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన అన్నారు. శనివారం ఐద్వా ఆధ్వర్యంలో ప్రజలు అందుతున్న వైద్య సేవలపై ఏరియా ఆస్పత్రి సర్వే నిర్వహించారు. రోగుల వార్డుల్లోకి వెళ్లి వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని మౌలిక వసతులను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులకు ఎక్కువగా పేదలే వస్తుంటారని సేవా మార్గంలో వైద్య సేవలు అందించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కొంపల్లి కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న ఐద్వా నేతలు

బహిరంగ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దవూర : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఈదుముడి లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆయన మహాసభ పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈదుముడి గ్రామంలో 21మందితో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఎన్నో విజయాలను సాధించిందలన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు, వృద్ధులకు, వితంతువులకు ఆసరా పెన్షన్ల పెంపు, తెల్లరేషన్ కార్డుదారులకు ఆరు కిలోల బియ్యం, ఆరోగ్యశ్రీతో పాటు ఎన్నో విజయాలను సాధించినట్లు తెలిపారు. ఈ మహాసభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదిమళ్ల సత్యనారాయణ, రామకృష్ణ, జానయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులు షురూ



గుర్రంపోడులో నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

గుర్రంపోడు : మండలం కేంద్రంలో విద్యుత్ సమస్యలపై అంతరాయం– నిరంతరం అని ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. గుర్రంపోడులో ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు, అస్తవ్యస్తంగా విద్యుత్ లైన్లు ఉన్న చోట అదనంగా పోల్స్ ఏర్పాటు, లూజ్‌లైన్లను సరిచేయడం వంటి పనులు ప్రారంభించారు. శనివారం నాంపల్లి రోడ్డు కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రెండు ఫీడర్లు ఏర్పాటు చేస్తారు. ఎక్కడ సమస్య వచ్చి కరెంటు మొత్తం పోయే పరిస్థితి లేకుండా చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

వేములపల్లి : మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎమ్మెల్సీ కోటిరెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను శనివారం మాజీ ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి అందజేశారు. వరికుప్పల హేమలతకు రూ.18,500, జిన్నె జానకికి రూ.15వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రయ్య, తరి సైదులు, శీలం జగన్, ముక్క శ్రీను, సంజీవచారి, వెంకటరెడ్డి, అశోక్, గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ శ్రీరాంరెడ్డి

తొలి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు



నాగార్జునసాగర్ : జలాశయతీరంలో ముస్తాబైన శివాలయం



దేవరకొండ : ముస్తాబవుతున్న మార్కండేయ స్వామి దేవాలయం

నాగార్జునసాగర్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నాగార్జునసాగర్ జలాశయ తీరంతో పాటు కృష్ణాతీరానగల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హిల్‌కాలనీలోని కాత్యాయని సమేత మల్లికార్జునస్వామి ఆలయం, రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయం, పైలాన్‌కాలనీలో రామాలయం, మల్లికార్జున ఆలయం, కృష్ణానది తీరంలోని శివాలయం తదితర ఆలయాలన్నింటిని భక్తుల రాక కోసం ప్రత్యేక శ్రద్ధతో సంబంధిత అధికారులు ముస్తాబు చేశారు. భద్రత, పారిశుద్ధ్యం, భక్తుల రాకపోకలకు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయాల ప్రాంగణాల్లో విద్యుత్ అలంకరణలు, శిఖర గోపురానికి ప్రత్యేక దీపాలంకరణలు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

దేవరకొండ : తొలి ఏకాదశి వేడుకలకు దేవరకొండ మండల పరిధిలోని ఆయా దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. పట్టణంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయం, పాత శివాలయం, మార్కండేయ స్వామి దేవాలయాలను తొలి ఏకాదశిని పురస్కరించుకొని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆయా దేవాలయాల్లో వేకువజామునే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా చర్యలు తీసుకుంటున్నారు.

మినా కళాశాలపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు బాధితులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న తాళ్లపల్లి రవి

మిర్యాలగూడ : విద్యార్థినిని ఇబ్బందులకు గురి చేస్తున్న పట్టణంలోని మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. బాధితులతో కలిసి శనివారం ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మునగాల మండలం నారాయణగూడ గ్రామానికి చెందిన కొలుకులపల్లి అఖిల తల్లి రోజువారి కూలీ పనికి వెళ్లగా అఖిల ఇంటి వద్ద ఉన్న సమయంలో మినా కళాశాలకు చెందిన ఆర్‌కె.రెడ్డి, ఆస్మా, పూజా అనే వ్యక్తులు అఖిలను బలవంతపెట్టి ఆమె నుంచి సర్టిఫికెట్స్ తీసుకొని వెళ్లారన్నారు. ఆ సర్టిఫికెట్లు తనకు ఇవ్వాలని గత మూడు రోజులుగా కళాశాల ఛైర్మన్ ఎండి.మహమూద్‌అలీని బతిమలాడినా కనికరం లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి కళాశాల ఛైర్మన్‌పై చర్యలు తీసుకోని విద్యార్థినికి తిరిగి సర్టిఫికెట్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్ రవీందర్

హాలియా : జూలై 5, 6వ తేదీల్లో వరంగల్ జిల్లాలోని హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక ఆకాంక్ష స్కూల్‌కు చెందిన విద్యార్థి పవన్ కుమార్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 29న నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి పవన్‌కుమార్ పాల్గొని 600 మీటర్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆ విద్యార్థి పవన్‌కుమార్‌ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

యూత్ ప్రధాన కార్యదర్శిగా వెంకన్నగౌడ్

చండంపేట : మండంలోని కోరుట్ల గ్రామానికి చెందిన పాలగోని వెంకన్నగౌడ్ బీసీ సంక్షేమ సంఘం యూత్ ప్రధాన కార్యదర్శిగా వెంకన్నగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ నియామక ఉత్తర్వులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్నగౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు నిర్వహించే పోరాటం భాగస్వామిని అవుతానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సత్యంగౌడ్, టేకులపల్లి వెంకటయ్య, శ్రీనివాస్‌యాదవ్, పాల్గొన్నారు.



నియామక పత్రం అందకుంటున్న వెంకన్నగౌడ్

చివరి శ్వాస వరకు పేదల పక్షాన పోరాటం

మిర్యాలగూడ అర్బన్ : చివరి శ్వాస వరకు పేదల అభ్యున్నతి కోసం మహ్మద్ బిన్ సయ్యద్ పని చేశారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మహ్మద్‌బిన్ సయ్యద్ ఐదో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణకోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవి నాయక్, నాయకులు బావండ్ల పాండు, రామ్మూర్తి, మల్లయ్య, బిఎం.నాయుడు, దేవయ్య, వాడపల్లి రమేష్, రామచంద్రు, మాధవ రెడ్డి, మంద రాజు, అరుణ, పూలమ్మ, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహ్మద్‌బిన్ సయ్యద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

నల్లగొండ టౌన్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ బకాయిలను విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. బిల్లులను విడుదల చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మారుపాక కిరణ్, మూడవత్ జగన్‌నాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు



సల్కునూరులో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

వేములపల్లి : మొహర్రం పండుగలో భాగంగా శనివారం మండలంలోని రావులపెంట, సల్కునూరు గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో గ్రామాల్లోని పలు వీధుల్లో పీర్లను ఊరేగించగా భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. శనివారం రాత్రి రావులపెంట గ్రామంలో అగ్నిగుండాలు నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం పీర్లను బావులకు చేరడంతో వేడుకలు ముగుస్తాయి.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని ఎంజీ యూనివర్సిటీ ఆర్ట్స్ సోషల్ సైన్సెస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.అరుణప్రియ పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహనతో పాటు స్వీయ బాధ్యతను గుర్తించేలా ప్రతి వారం విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల అంజిరెడ్డి, ఆనంద్, షరీఫ్, అనితకుమారి పాల్గొన్నారు.



క్లీన్ అండ్ గ్రీన్‌లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రిజర్వేషన్ల అమలుకు బాధ్యత వహించాలి

నల్లగొండ టౌన్ : 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు బాధ్యత వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు 42శాతం రిజర్వేషన్లను సాధించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి చేతులు దులుపుకోకుండా అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. జనగణనలో కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం అనడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, ఆయా పార్టీల నాయకులు పంకజ్‌యాదవ్, ఎల్వీ యాదవ్, పిల్లి రామరాజుయాదవ్, కొండూరు సత్యనారాయణ, వంగూరు నారాయణయాదవ్, పందుల సైదులు, మాదగోని భిక్షపతిగౌడ్, పొట్టబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివారల ప్రకారం .. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామ శివారులో మూసి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం మేరకు యాద్గార్‌పల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా ఒక ట్రాక్టర్ ఇసుక లోడు వస్తుండగా పట్టుకుంటుకున్నారు. ట్రాక్టర్ వదిలి డ్రైవర్ పరారు అయినట్లు తెలిపారు. మిర్యాలగూడ మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ధీరావత్ కృష్ణ, ట్రాక్టర్ యాజమాని ధీరావత్ లక్ష్మీపతిలపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

డిండి : మండల పరిధిలోని పెద్దతండాకు చెందిన కాట్రావత్ నరేష్ ఇటీవల మృతి చెందాడు. శనివారం అదే గ్రామానికి చెందిన శ్రీ బంజారా భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.55,500 ఆర్థికసాయంగా, రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. అంతకుముందు నరేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా భవిత కేంద్రం



పునఃరుద్ధరణ తరువాత భవిత కేంద్రం భవనం



భవితకేంద్రంలోని ఆటవస్తువులు

- రూ.3లక్షలతో పునఃరుద్ధరణ పనులు
- దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు
- కేంద్రంలో అందమైన బొమ్మలు, ఆటవస్తువులు

నిడమనూరు : నిడమనూరు భవిత కేంద్రాన్ని రూ.3 లక్షలతో పునరుద్ధరించారు. రంగులు, విద్యుత్ పనులు, ప్రవేశానికి స్టీల్ రెయిలింగ్, టాయిలెట్ల పునఃరుద్ధరణ పనులు చేపట్టారు. దీంతో దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన సేవలందనున్నాయి. భవిత కేంద్రంలో వారికి సహిత విద్యనందించి(వికలాంగులకు అందించే ప్రత్యేక విద్య) సాధారణ విద్యార్థులతోపాటు దివ్యాంగ విద్యార్థులను చదువుకునేలా భవిత కేంద్రాలు పనిచేస్తాయి. నిడమనూరు భవిత కేంద్రం గోడలపై అందమైన బొమ్మలు, వివిధ రకాల రంగులతో కూడిన చిత్రాలు రూపొందిస్తున్నారు. భవిత కేంద్రంలో ఫిజియోథెరపీస్ట్ సేవలు కూడా సోమవారం, గురువారం రోజుల్లో ఫిజియోథెరపీ సేవలందనున్నాయి. నిడమనూరు మండలంలో సర్వే నిర్వహించి 110 దివ్యాంగ చిన్నారులను గుర్తించారు. వారిలో ఎంపిక చేసిన 10మంది వరకు దివ్యాంగ చిన్నారులకు సహిత విద్య, ఫిజియోథెరపీ, ఆట, పాటలతోపాటు, ప్రత్యేక బొమ్మలతో విద్యనందిస్తారు. ప్రత్యేక శిబిరాల ద్వారా అందరికీ కూడా వైద్యసేవలు, ఫిజియోథెరఫీ సేవలందిస్తారు. నిడమనూరు భవిత కేంద్రంలో మూడేళ్లలో 20 మందికిపైగా చిన్నారులను సాధారణ విద్యార్థులతోపాటు చదువుకొనేలా సేవలందించారు. 18మంది దివ్యాంగ చిన్నారులకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు-3, రోలేటర్లు(పట్టుకొనే పరికరాలు)-3 పరికరాలు మూడేళ్లలో భవిత కేంద్రం ద్వారా ఇప్పించారు. ప్రభుత్వం నుంచి పరికరాలే కాకుండా సదరం శిబిరాల్లో హాజరయ్యేలా సేవలందించి. సదరం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు.

దివ్యాంగ చిన్నారుల్లో ఆత్మస్థైర్యం



దివ్యాంగ చిన్నారుల్లో మానసిక వికలాంగ విద్యార్థుల్లో ప్రాథమిక విద్య, వారిలో అభ్యసన విద్యా అందించేలా సహిత విద్యనందిస్తున్నాం, మండలం యూనిట్ సర్వే చేసి, వికలాంగులను గుర్తించాం. వారిని ఎంపిక చేసి విద్యనందిస్తున్నాం. భవిత కేంద్రాల్లో ఆట, పాటలతోపాటు, పలు ప్రత్యేక పరికరాలు, ఆట వస్తువులతో వికలాంగ విద్యార్థుల్లో ప్రాథమిక విద్య, విజ్ఞానం అందిస్తున్నాయి.

– జి వెంకటేశ్వర్లు, ఐఈఆర్పీ

క్లుప్తంగా

18న బహిరంగ వేలం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లిలోగల శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఒక సంవత్సరం కాలపరమితికి పూజా సామగ్రితో పాటు ఇతర వస్తువులు విక్రయించేందుకు ఈనెల 18న ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త కొందూటి సిద్ధయ్య, కార్యనిర్వహణ అధికారి బి.జ్యోతిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనే ముందు డిపాజిట్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని యాద్గార్‌పల్లిలో నూతన సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ లైన్ మరమ్మతులతో పాటు ఇతర పనుల నేపథ్యంలో ఇండస్ట్రీయల్ 2ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్3 పరిధిలో ఉన్న సూర్య, వసుందర, మహాలక్ష్మి, ఆర్‌శ్రీసివి, కామోడిటిస్ మిల్లులకు నేటి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని ట్రాన్స్‌కో మిర్యాలగూడ ఏఈ బి.అమర్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

త్రిపురారం : మండలంలోని రాగడప ఎస్సీ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు విద్యుత్ అధికారులను శనివారం ఒక ప్రకటనలో వేడుకున్నారు.గత కొన్ని రోజులు విద్యుత్ సరఫరా కావడం లేదని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. గత నాలుగు నెలల కిందట నూతన ట్రాన్స్‌ఫార్మర్లు అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా కావడం లేదని వాపోతున్నారు. లైన్‌మెన్‌కు, ఏఈకి పలుమార్లు విన్నవించుకున్నా కాంట్రాక్టర్ ద్వారా పూర్తి చేయిస్తామని చెబుతున్నారు కానీ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాయ్యే విధంగా చూడాల ని ఆ కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా వీలైనంత త్వరగా నూతన ట్రాన్స్‌పార్మర్‌కు లైను కలిపి అందిస్తామని తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

డిండి : అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మొదటి విడుతలో భాగంగా మండలంలో ఇప్పటి వరకు తయారు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో సగానికిపైగా అనర్హులున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేసి అర్హులైన వారికి మాత్రమే జాబితాలో చోటు కల్పించాలన్నారు. ఆయన వెంట ఆ పార్టీ మండలాధ్యక్షుడు సింకారు సైదా, డిండి పట్టణ అధ్యక్షుడు బాదమోని సాయిగౌడ్, అంజియాదవ్, రాఘవేంద్ర, అమృత్, తదితరులున్నారు.

బాసర ఐఐఐటీలో విద్యార్థినికి సీటు



స్పందన

కొండమల్లేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డుపల్లి స్పందన పదో తరగతిలో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించింది. దీంతో బాసర ఐఐఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం ఆర్.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ స్పందన బాసర ఐఐఐటీలో సీటు సాధించడంపై విద్యార్థినిని అభినందించారు.

ఆకలి తీర్చడం గొప్ప విషయం

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు ఆకలి తీర్చడం గొప్ప విషయమని పీఎంజేఎఫ్ లయన్ టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు ఆయన అల్పాహారం అందజేసి మాట్లాడారు. మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రుల్లో అందజేస్తున్న నిత్య ఉచిత అల్పాహార కార్యక్రమం మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో భీమయ్య, మోహన్‌రావు, సతీష్‌కుమారు, శివశంకర్, సింహాద్రి, గోలి అమరేందర్‌రెడ్డి, కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో హమాలీలు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, ప్రధాన కార్యదర్శి దండంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అవుట రవీందర్, అంబటి వెంకన్న, మధుసూదన్, సోమయ్య, ప్రవీణ్‌కుమార్, దొండ నరేష్, పాల్గొన్నారు.